🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
☏ : 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు
ఉపకులపతి (FAC)

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు


సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 32 | 08-05-2023 | పుటలు : 4

# ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

## చిహ్నం - సందేశం




**సూర్యోదయం :**

నిర్మలమైన నీలిమేఘాల మధ్య ఉషోదయం !

**ఉదయిస్తున్న సూర్యుడు వికసిస్తున్న విద్యార్థికి ప్రతీక.** చదువుల్లో వెలుగై , విలువల్తో రాణించి సమాజానికి ఉపయోగపడే విద్యార్థిలోకం తరగతి గదుల్లో నిర్మాణం కావాలనే ఆశయానికి సంకేతం !!

**వలయాలు :**

భారత జాతీయ పతాకంలోని మూడు వర్ణాలు – మొదటి వలయం. అందులో శిరోభాగాన అశోకుని ధర్మచక్రం. ఒకరోజు మనిషి పరిశ్రమకు కాలచక్రంలో 24 గంటలు – ధర్మచక్రంలో 24 ఆకులు. చక్రం పారిశ్రామిక వృద్ధికి సంకేతం. చక్రం మానవ ప్రగతికి చిహ్నం. కాల స్వరూపం. అశోకుని ధర్మచక్రం చివరికి ధర్మమే, సత్యమే జయిస్తుందనే సంబోధనను కలిగి ఉంది.

రెండవ వలయం చతుష్షష్టి కళలకు ప్రతీక. 64 పుష్పాలు – 64 కళలు. సంగీతం, కవిత్వం, శిల్పం, చిత్రలేఖనం, నాట్యం, క్రీడలు, చదరంగం, గణితం, యంత్ర జ్ఞానం, నిర్మాణాలు, శాస్త్ర పఠనం . . . . . మొదలైన 64 కళలు మనిషిని మనీషిగా (బుద్ధిమంతునిగా), పరమానంద స్వరూపునిగా తీర్చిదిద్దుతూ సంతృప్తిని, ప్రశాంతతను అందిస్తున్నాయి. ఎరుపు, ఆకుపచ్చ, ముదురునీలం ప్రాథమిక వర్ణాలు. జాతీయ పతాకాన్ని ప్రతిబింబిస్తున్నాయి. వాటి నడుమ తెలుగు, ఆంగ్ల భాషలలో విశ్వ విద్యాలయం పేరు దర్శనమిస్తోంది.

**బోధివృక్షం (రావిచెట్టు)**

అది ఆధ్యాత్మిక సంకేతం. బుద్ధుని జ్ఞానోదయానికి, అష్టాంగ మార్గ బోధనకు వేదిక. దాని కాండ భాగం ఒకటి చిన్ముద్ర. మూడు వ్రేళ్ళు – మనసా, వాచా, కర్మణా ఆచరించగలిగితే తర్జని (చూపుడు వేలు) , అంగుష్ఠం (బొటనవ్రేలు) లో కలసి ఆత్మ – పరమాత్మ అభేదాన్ని సాధించి అద్వైత తత్వంతో మనిషి మహాత్ముడై దైవత్వం స్థాయికి చేరుతాడని తెలియజేస్తూ , ఆ సారాంశాన్ని గురువు
శిష్యునికి అందించటం దానిని విద్యార్థి తన చేతితో అందుకోవటం కనిపిస్తుంది. జ్ఞానం నిరంతర సముపార్జనమైంది. తరగతి గదుల్లో మెల్లగా మొదలైన చదువు అత్యుత్తమ గ్రంథ పఠనంతో , లౌకిక పరిజ్ఞానంతో, పరి శోధనలతో, అనుభవంతో రాణించి పరిపూర్ణ మానవ వికాసానికి కారణ మవుతుంది. ఆ చెట్టుకున్న ఆకులు కొన్ని లేత, కొన్ని ముదురు పచ్చని, కొన్ని పరిపక్వమై పండిన రంగులో కనిపిస్తూ మనిషి విజ్ఞాన స్థాయిలను తెలియజేస్తున్నాయి. అంతేకాక పర్యావరణ హితమైన వృక్షజాతికి రావిచెట్టు సంకేతం.

**చాళుక్య ద్వారం**

రాజమహేంద్రపురాన్ని రాజధానిగా చేసుకొని ఆంధ్రదేశాన్ని పరిపాలించిన తూర్పు చాళుక్యుల కోటలోనికి ప్రవేశించే మార్గం చాళుక్య ద్వారం. అది వారి నిర్మాణ కళకు చాళుక్య శిల్పానికి తార్కాణంగా చాళుక్య భీమవరపుకోట (సామర్లకోట), దక్షారామ భీమేశ్వరాలయాల నిర్మాణాలలో కనిపిస్తుంది. ఆ నమూనాను విశ్వవిద్యాలయ ప్రవేశ ద్వారంగా నిర్మించి విశ్వ విద్యాలయస్థలాన్ని 'రాజరాజ నరేంద్ర నగర్' గా నామకరణం చేశారు. ఆ ద్వారంలోంచి ఒక ప్రగతి పథం, పర్వత ప్రాంతంలో సహజమైన ఎర్రనేల వృక్ష సంపదకు ఆవాసంగా కన్పిస్తాయి.

**నదీతీరం**

పావన గోదావరి నదికి తూర్పు ముఖం రాజమహేంద్రి నగరం. వృద్ధగోదావరి గౌతమీగంగలో స్నానమాచరించి, నీటిని తీసుకొని పైకి వస్తాం. అవిగో నాలుగు మెట్లు. ధర్మార్థ కామ మోక్షాలనేచతుర్విధ పురుషార్థాలు !

**ధర్మబద్ధమైన జీవితం - ప్రవర్తన**
**ధర్మబద్ధమైన అర్థం - సంపాదన**
**ధర్మబద్ధమైన కాంక్ష - గృహస్థాశ్రమం**

ఈ మూడు ధర్మబద్ధమైనపుడు మోక్షం సాకారమౌతుందని జీవితానికి ఒక సరైన దారి ఏర్పడుతుందని సందేశం.

**పూర్ణకుంభం**

పూర్ణకుంభం ఆంధ్రుల రాజ చిహ్నం. కలశం భగవద్రూపం. పూర్ణకుంభం పరిపూర్ణ వ్యక్తిత్వానికి ఉదాహరణ. దాని మీద ఉన్న మూడుగీతలు బాల్యం, యౌవనం, వార్ధక్యం – మనిషి జీవితం ! కమలం విజ్ఞాన వికాసాలకి ప్రతీక. సూర్యోదయానికి వికసించిన కమలం జ్ఞాన సముపార్జనతో విజ్ఞాని అవుతున్న విద్యార్థికి ప్రతీక !

**తాళపత్రం**

సమస్త భారతీయ ప్రాచీన వాఙ్మయం తాళపత్ర లిఖితమై ఉంది. చతుర్వేదాలతో సమంగా మహాభారతాన్ని పంచమ వేదంగా, విజ్ఞాన సర్వస్వంగా భారతీయులు గౌరవించారు. ఐదు
తాళ పత్రాలు ఐదు వేదాలకు ప్రతీకలు. సంస్కృత మహాభారతాన్ని అష్టాదశ (18) పర్వాలుగా విభజించి రెండున్నర పర్వాల రచనతో తెలుగు కవిత్వానికి ఆద్యుడయ్యాడు నన్నయ భట్టారకుడు. దానికి గౌతమీ తీరం వేదికైంది . నిత్య సత్యవచనుడైన నన్నయ పేరుతో విశ్వ విద్యాలయానికి నామకరణం జరిగింది. ఆ తాళపత్రంపై ఒక సూక్తివాక్యం - **'సర్వత్ర విద్యయా వర్ధతే ప్రజా'** విద్యను అన్ని తావుల అందించ గలిగితే సమస్త జనులు అభివృద్ధి చెందుతారనేది ఆ వాక్య సారాంశం !!

**ఆశయం**

శ్రమలో, కర్తవ్యంలో, బోధనలో, శోధనలో, విద్యలో, వినయంలో మనిషికి లౌకిక, ఆధ్యాత్మిక సందేశాన్నిస్తూ విద్యా పరిపూర్ణత్వాన్ని గోచరించే రూపంలో విశ్వవిద్యాలయచిహ్నం మనకు ఆహ్లాదంగా దర్శనమిస్తుంది. చిహ్నంలోని ప్రతీకల ద్వారా సమున్నత సందేశాన్ని అందిస్తోంది.

**ఆ సారాంశాన్ని అందిపుచ్చుకొని**
**ఆచరించటమే మన కర్తవ్యం !!**

విశ్వవిద్యాలయ చిహ్నం రూపకల్పన
**ఆచార్య పసలపూడి జార్జ్ విక్టర్**
నన్నయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి (2012-2015)
(తత్వశాస్త్ర విభాగం - ఆంధ్ర విశ్వవిద్యాలయం)
సాంకేతిక సహకారం : శ్రీ జనా చంద్రశేఖర్

## సంపాదకీయం



# కైజెన్

రోడ్డుమీద వెళ్తున్నప్పుడు లారీల వంటి పెద్ద వాహనాలు వెనుక 'నిదానమే ప్రధానం'అని రాసి ఉంటుంది. చూసే ఉంటారు. ప్రధానమేకాదు 'నిదానమే విధానం' కూడా. దీనినే కైజెన్ సూత్రమంటారు. ఏ మార్పు అయినా క్రమక్రమంగా జరగాలంటున్నది జపనీయుల కైజెన్ సూత్రం.అది ఏ రంగంలోనైనా కావచ్చు. అంతెందుకు జీవనశైలి సర్దుబాటుకు కూడా ఇది వర్తిస్తుంది. చిన్నచిన్న అడుగులు శక్తిమంతంగా పనిచేస్తాయి.తీవ్రమైన వేగం లేకపోవచ్చు.గమ్యం చేరుకోవాలన్న తపన, సాధన గొప్పవి.

చాలా చిన్నప్పటి కథలో పందెంలో కుందేలు పరుగులతో ముందుకెళ్లి చెట్టుక్రింద సేద తీరుతూ నిద్రపోతుంది.తాబేలుకు లక్ష్యమే సర్వస్వం కాబట్టి గెలిచింది.ఇదే కైజెన్ సిద్ధాంతం. కొద్ది కొద్ది మార్పులే దీర్ఘకాలంలో కొండంత ప్రభావాల్ని చూపుతాయి. క్రమ క్రమమైన ఎదుగుదల ఏదో ఓ రోజు ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్తాయి. చిన్న చిన్న ప్రయత్నాలన్నీ పోగై కొండంత అండనిస్తాయి.

జపనీస్ భాషలో కై అంటే మార్పు.జెన్ అంటే మంచి. కైజెన్ అంటే మంచిమార్పు. నిరంతరం మెరుగుపడుతూ ఉండటం. మెరుగుపడాలి కూడా. కొత్తను ఆమోదించలేని అభద్రత కైజెన్ సూత్రానికి పరమ శత్రువు. పలాయన వాదం,ఓడిపోవటం,ఉన్నది ఉన్నట్లే ఉంచాలనుకోవటం,ఏ మార్పునూ కోరుకోకపోవటం ఈ సిద్ధాంతానికి వీలుకాదు.కైజెన్ కు పరిమితులు, మినహాయింపులు,హద్దులు లేవు.ఎక్కడైనా,ఎప్పుడైనా ఎవరైనా అన్వయించుకోవచ్చు. వ్యక్తి, వ్యవస్థ, సంస్థ ఏదైనా కావచ్చు. ఒక్కసారి ఆ నిదానాన్ని , విధానాన్ని అలవాటు చేసుకుని మనో స్థైర్యాన్ని కూడగట్టుకుంటే ఓ పెద్దమార్పు వైపుగా చిన్న ప్రయత్నం మొదలైనట్లే.


"ఎందుకు?"అన్న ప్రశ్న నాకు నేర్పినందుకు ఈ పుస్తకం మా నాన్నకు అంకితం! అన్నారు త్రిపురనేని గోపీచంద్.ఎందుకు? అన్న ప్రశ్న దగ్గరే ఆచరణ మొదలవుతుంది.

"నీ బాధ్యతల్ని నీవు సక్రమంగా నిర్వర్తించు. అదే సర్వస్వం అన్నట్టు,ఆ పనిలో లీనమైపో. కర్మ ఫలాలతో ఎలాంటి అనుబంధం పెంచుకోవద్దు. ఫలితాల సంగతి నాకు వదిలిపెట్టు" అంటారు గీతాచార్యులు.కైజెన్ సూత్రంలో కూడా ఇదేఉంది. ఫలితం కంటే పరిపూర్ణతకే ఇక్కడ పెద్దపీట! పనిలో ఆనందాన్ని పొందటంలో ఫలితం గురించిన ఆలోచనేముంది? కైజెన్ సూత్రం మూలాల్లోంచి మొదలౌతుంది. కింది స్థాయి నుంచి చిన్న చిన్న మార్పుల నుంచి ప్రారంభమవుతుంది.కింది స్థాయి ఉద్యోగి నుంచి అధికారి వరకూ పనితీరు మీద, పరిజ్ఞానంమీద ఈ సూత్రం పని చేస్తుంది.

మసాకీ ఇమాయ్ రాసిన 'కైజెన్ – ది కీ టు జపాన్స్ కంపిటీటివ్ సక్సస్' పుస్తకం కైజెన్ అభిమానులకు భగవద్గీత, బైబిల్, ఖురాన్ లాంటిది. ఒక్కో మెట్టూ నిదానంగా ఎక్కే విజేతలకు ఘోర వైఫల్యాలు ఉండవు. నిన్నటితో పోలిస్తే ఈరోజు నువ్వెంత మారావు... ఈరోజుతో బేరీజు వేస్తే రేపటికి ఇంకెంత మారబోతున్నావు... ఇలా ఆ మదింపు చిన్న చిన్న మార్పుల చుట్టూ తిరుగుతుంది.కైజెన్ లో లక్ష్యాన్ని చేరుకునే ప్రక్రియ ప్రధానమైంది.

కైజెన్ సూత్రం ప్రకారం టీం వర్క్ కన్నా టీంలో ఉండే మనుషులు ఒకరిపై ఒకరికుండే నమ్మకం, నిబద్ధత,పనిపట్ల శ్రద్ధ,ఓర్పు,నిదానం,ఒక విధానం....ఇవే ముఖ్యమైనవి ఏ పనికైనా,ఏది సాధించటానికైనా.విజయోస్తు!!

# పోస్ట్ చేయని ఉత్తరం







నన్ను మీ జీవితంలో చేర్చుకోండి. నేను జీవితాంతం మీకు తోడుంటాను అంటున్న పుస్తకం పోస్ట్ చేయని ఉత్తరం. జీవితానికి సంబంధించిన వివేకాన్ని ఈ పుస్తకం ఎంతో సరళంగా, మరింత సమర్ధంగా మన ముందుంచుతుంది ఈ పుస్తకం.ఒక తెలివైన మాటని చదవటంతో రోజువారి సీనియర్ మేనేజ్మెంట్ సమావేశాన్ని ప్రారంభిస్తుంటాం. దానివల్ల మనం జీవితాన్ని చూసే విధానంలో గొప్ప మార్పు కలుగుతుంది. అంతర్దృష్టికి సంబంధించిన చిన్న చిన్న శక్తివంతమైన వాక్యాలు మనకు కావలసిన స్పష్టతని అద్భుతంగా అందిస్తాయి. మానవ ప్రయత్నానికి సంబంధించిన ఏ రంగంలోనైనా అది ఆధ్యాత్మికమైనదైనా, భావాత్మకమైనదైనా, భౌతికమైనదైనా అత్యధికంగా కాంక్షించేవారికైనా అవ్యక్తంగా ఉన్న అనంతమైన విరాట్ శక్తిని మానవ చైతన్యం విశ్వసించేలా మార్పు తీసుకొచ్చి అడ్డంకులని అధిగమించటానికి దారి చూపుతుంది ఈ పుస్తకంలోని ఇన్ఫినిథీయిజమ్. ఈ పుస్తకంలోని పేజీల్లో పాఠకులకు అనేక పరిష్కారాలు దొరుకుతాయి. అవి మానవీయ చైతన్యానికున్న అనంతమైన విరాట్ శక్తిని అర్థం చేసుకునేందుకు దోహదం చేస్తాయి. ఆధ్యాత్మిక, భావాత్మక, భౌతిక రంగాలలో వేటిలోనైనా సమృద్ధిని కాంక్షించటానికి ప్రయత్నిస్తున్న వారి కోసమే ఈ పుస్తకం.అత్యధికంగా మరింత గొప్పగా జీవించే పురోగతిని పాఠకులు ఈ పుస్తకం ద్వారా సాధిస్తారని ఆశించారు రచయిత మహాత్రయా రా. ఆర్.శాంత సుందరి తెలుగులో అనువాదం చేసిన ఈ గ్రంథాన్ని మంజుల్ పబ్లిషింగ్ హౌస్ ప్రచురించింది. ఐన్స్టీన్ తన జీవితాన్నంతా ధారబోసి ఈ ప్రపంచానికి కొన్ని సిద్ధాంతాలని అందించారు. అప్పటినుంచి ఈ ప్రపంచం అంతకు ముందు ఉన్నట్టు లేదు. ఎడిసన్ జీవితం ప్రపంచంలోని మనుషుల జీవన విధానాన్ని మార్చేసింది. గాంధీ, మండేలా ఒక కొత్త సంస్కృతికి జన్మనిచ్చారు. మిల్టన్, టాగూర్ కవిత్వానికి కొత్త నిర్వచనాన్ని ఇచ్చారు.రోజర్ బానిస్టర్,ఎడ్మండ్ హిల్లరీ మానవ సామర్థ్యానికి కొత్త నిర్వచనాన్నిచ్చారు.సోక్రటీస్,అరి స్టాటిల్, ప్లాటో ప్రపంచం ఆలోచించే విధానాన్ని మార్చేశారు. మన ముందు తరాలు మానవ చైతన్య వికాసానికి తమవంతు పాత్ర నిర్వహించినట్లు చరిత్రలో అక్షరబద్ధమై ఉంది. దాని తాలూకు ఫలితాలను మనం అనుభవిస్తున్నాం కూడా. అలాగే పాఠకుల జీవితాలలో ఏదైనా మార్పు తీసుకురావడానికి చేసిన ప్రయత్నమే ఈ పుస్తక రచన అంటారు రచయిత మహాత్రయ. తప్పనిసరిగా, శ్రద్ధగా చదవాల్సిన పుస్తకాలలో ఇదొకటి. కొద్ది రోజులు మన చేతులు దీనిని ధరిస్తూ, కొన్ని విషయాలను మస్తిష్కం స్వీకరిస్తే మన ఆలోచనలు, ఆచరణలు చాలా ఉత్కృష్టంగా ఉంటాయన్నది నా అభిప్రాయం.

సమీక్ష: టి. శ్రీసాహితి
పూర్వ విద్యార్థి, సైకాలజీ విభాగం, అనూర్

ADIKAVI NANNAYA UNIVERSITY
RAJAMAHENDRAVARAM
UNIVERSITY COLLEGE OF EDUCATION
DEPARTMENT OF PHYSICAL EDUCATION

M.P.Ed. Admissions are Open 2023-2025 Batch

MASTER OF PHYSICAL EDUCATION (M.P.Ed)

Eligibility : B.P.Ed.

GAMES & SPORTS FACILITIES



About Program
- M.P.Ed 2years Program(4 Semesters)
- Best Curriculum in India
- Student Placement Cell
- Well Equipped Laboratory
- Institutional Training

ADIKAVI NANNAYYA UNIVERSITY is fully equipped with sports and games equipment with more number of games and sports facilities.

M.P.ED seats are available in our ADIKAVI NANNAYYA UNIVERSITY with lowest fee of Rs. 2350/- (For Scholar eligible candidates)

Our ADIKAVI NANNAYYA UNIVERSITY is fully equipped with sports and games equipment with more number of courts available.

Students not eligible for scholarship has to pay Rs. 21100/- per year.

Well Established Library facility, Hostel facility, Multi purpose Indoor hall and International Swimming Pool are available in our esteemed ADIKAVI NANNAYYA UNIVERSITY.

Among all other AP State Universities Only our ADIKAVI NANNAYYA UNIVERSITY is giving M.P.ED seats at the lowest fee i.e 2350/-

Hostel facility for both boys and girls is available.

Teaching with fully qualified and experienced faculty.

Successful placements for outgoing students

CONTACT US
8500114240, 8297836888
9440212188, 9014011117
8639918159, 9494660306

mail id : phyedu.uced@aknu.edu.in

APPLY NOW Through APPGCET
M.P.Ed. SUBJECT CODE : 203



ADIKAVI NANNAYA UNIVERSITY
DEPARTMENT OF PSYCHOLOGY
RAJAMAHENDRAVARAM



M.Sc Psychology

ADMISSIONS OPEN FOR 2023

ELIGIBILITY: ANY GRADUATION

ABOUT PROGRAM
- 2 Years Program (4 Semesters)
- Best Curriculum in India
- Well Equipped Laboratory
- Institutional Training
- Students Placement Cell



ABOUT US

The Department of Psychology was established in the year 2010. Currently, the Department is running with highly qualified faculty. The Department was set up to develop an awareness of the importance of studying human behaviour and the societal relevance of psychology.

CONTACT US
+91 9246287989, 9985594555
psy.ucac@aknu.edu.in

APPLY THROUGH APPGCET
SUBJECT CODE : 313 PSYCHOLOGY


## APPGCET-2023

**Andhra Pradesh Post Graduate Common Entrance Test-2023**
**Conducted by Andhra University, Visakhapatnam**
**on behalf of APSCHE**

### AP PGCET-2023 Important Dates

| S. No | Particulars | From | To |
|---|---|---|---|
| | Date of Notification in the News Papers | 28-03-2023 | Publishes in 29-03-2023 news papers |
| 2 | Commencement of submission of Online applications | 01-04-2023 | |
| 3 | Registration & submission of online application without late fee | 01-04-2023 | 11-05-2023 |
| 4 | Submission of online applications with late fee (Rs. 500/- + Registration fee) | 12-05-2023 | 21-05-2023 |
| 5 | Submission of online applications with late fee (Rs. 1000/- + Registration fee) | 22-05-2023 | Updated shortly |
| 6 | Corrections to be made, if any to submitted online applications | 29-03-2023 | 30-05-2023 |
| 7 | Downloading of Hall-tickets from the website | 01-06-2023 | |
| 8 | Examination date | 06-06-2023 to 10-06-2023 | |
| 9 | Examination timings | 09:30 AM to 11:00 AM<br>01:00 PM to 02:30PM<br>04:30 PM to 06:00 PM | |
| 10 | Preliminary Key | Exam Date:<br>06/06/2023<br>07/06/2023<br>08/06/2023<br>09/06/2023<br>10/06/2023 | Preliminary Key Release:<br>08/06/2023 6:00 PM.<br>09/06/2023 6:00 PM.<br>10/06/2023 6:00 PM.<br>11/06/2023 6:00 PM.<br>12/06/2023 6:00 PM. |
| 11 | Objections on Preliminary Key | Exam Date:<br>06/06/2023<br>07/06/2023<br>08/06/2023<br>09/06/2023<br>10/06/2023 | Last date to receive Objections:<br>10/06/2023 6:00 PM.<br>11/06/2023 6:00 PM.<br>12/06/2023 6:00 PM.<br>13/06/2023 6:00 PM.<br>14/06/2023 6:00 PM. |
| 12 | Declaration of Results | Will be Announced Later | |

## ప్రమిద



ఎప్పుడూ
చుట్టూ నలుగురితో
అరుగు మీద కూర్చుని
వచ్చిపోయేవాళ్ళని నోరారా పలకరిస్తూ
ఉండేది
మా ఊరు..

పెద్దరుగుల ఇల్లు.
ఒకప్పుడు అరుగే చిరునామా
మా ఊళ్ళో కొన్నిళ్ళకు.

అరుగుపై చుట్ట గుప్పుతూ మా ఊరు
కొత్తవాళ్లు కనిపిస్తే
తాపీగా ఆరాలాగి ఇంటిదాకా
దిగబెట్టివచ్చేది.

నిద్రలేవగానే
అరుగుపైకి చేరి
వార్తల్ని నోట్లో వేసుకుని పుక్కిలించనిదే
పళ్లు తోమేదికాదు మా ఊరు.

ఎలక్షన్స్ వస్తే
ఎక్జిట్ పోల్స్ అంటే తెలీనిరోజుల్లో
రాజకీయ ముఖచిత్రాన్ని
ఈ అరుగు మీదే గీసేది మాఊరు.

దిగులుగుండె ఎదురైతే
నలుగుర్నీ పోగేసి
కొన్ని ధైర్య వచనాల్ని దారంగా పేని
హృదయాన్ని గాలిపటంగా
ఈ అరుగు మీదే సంతోషపు
అంచులదాకా
ఎగరేసేది మా ఊరు.

మా ఊరు
గొప్పగా బతికిన రోజుల్లో
ఇంట్లోని సంతోషపు అలలు
టీ లుగానో, మిఠాయిలుగానో
అరుగులతీరం దాకా పొంగేవి.
అదే ఇంట కష్టం తిష్టవేస్తే
తరిమేదాకా అవే అరుగులు
మానవత్వపు మడులుగా విచ్చుకునేవి.

ఇంటిని చక్కదిద్ది
వెలుగు తగ్గి వృద్ధాప్యం మీద పడ్డాకా
కాలక్షేపపు తైలం పోస్తూ
దీపం కొండెక్కేదాకా
వీధిఅరుగే ప్రమిదై ఊరికి
ఊపిరిపోసేది.ఒకుటిళ్లను వదిలి
డబుల్ బెడ్రూం ఇంట్లోకి మారిపోయిన
మాఊరు
వృద్ధాప్యాన్ని,అరుగుల్ని
ఆరుబయట గాలికొదిలేసింది.

**- జగపతి అడబాల, కోనసీమ**

## మంచిమాట



ఈ ప్రపంచంలో మన చేతలే మన భావి జీవితాన్ని నిర్ధారిస్తాయి.

All our actions in this world will determine our future life.

- స్వామి వివేకానంద

# "ఆంధ్రా షేక్స్‌పియర్" శ్రీ చిలకమర్తి లక్ష్మీ నరసింహం.

రాజమహేంద్రి కవి, రచయిత, నాటక కర్త, పాత్రికేయుడు, సంఘ సంస్కరణవాది, విద్యావేత్త, "ఆంధ్రా షేక్స్‌పియర్" శ్రీ చిలకమర్తి లక్ష్మీ నరసింహం.

**భరతఖండంబు చక్కని పాడియావు**
**హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ**
**తెల్లవారను గడుసరి గొల్లవారు**
**పితుకుచున్నారు మూతులు బిగియగట్టి.**

తెలుగునాట ఆధునిక భావ వికాసానికి పట్టుగొమ్మలుగా నిలిచిన మహామహులలో చిలకమర్తి లక్ష్మీ నరసింహం ఒకరు. ప్రముఖ కవి, రచయిత, నాటక కర్త, పాత్రికేయుడు, సంఘ సంస్కరణవాది, విద్యావేత్త అయిన చిలకమర్తి... 20వ శతాబ్దం ఆరంభ కాలంలో తెలుగు సాహిత్య అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు.తన సహజమైన కవిత్వ ధోరణిలో సామెతలను, నాటి సామాజిక స్థితిగతులను జొప్పించి నాటకాల రూపంలో రచించి ప్రజల ఆలోచనలకు చైతన్యం కలిగేటట్లు చేసిన గొప్ప నాటక కర్త, పాత్రికేయుడు, సంఘ సంస్కరణవాది మన చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు.

**విద్య-ఉద్యోగ జీవితం:**

లక్ష్మీనరసింహం పశ్చిమ గోదావరి జిల్లా, పెరవలి మండలంలోని ఖండవల్లి గ్రామానికి చెందిన ఒక బ్రాహ్మణ కుటుంబంలో వెంకయ్య, రత్నమ్మ అనే దంపతులకు 1867, సెప్టెంబర్ 26వ తేదీన జన్మించారు. వీరవాసరం, నరసాపురం పట్టణాలలో ప్రాథమిక విద్యను పూర్తి చేసిన చిలకమర్తి, 1889లో రాజమండ్రి హైస్కూలులో పట్టా పుచ్చుకున్నారు. 1889లోనే రాజమండ్రిలో ఆర్య పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించారు. అనంతరం ఇన్నీస్ పేట పాఠశాలలోనూ, మునిసిపల్ హైస్కూల్లోనూ విద్యాబోధన సాగించిన లక్ష్మీ నరసింహం, ఆపై ఒక సంవత్సరంపాటు పత్రికా సంపాదకునిగా కూడా పనిచేశారు. అటుపై ఉద్యోగానికి స్వస్తి చెప్పారు.

**పాఠశాలలు ప్రారంభం:**

1899లో హిందూ లోయర్ సెకండరీ స్కూల్‌ను స్థాపించి తొమ్మిది సంవత్సరాలపాటు నడిపారు. ఆ తరువాత అది వీరేశలింగం హైస్కూల్‌గా పేరు మార్చబడింది. మొదటి తరం సంఘ సంస్కర్త చిలకమర్తిగారు 1909లో సామాజికంగా వెనుకబడిన వర్గాలకోసం ఒక పాఠశాల ప్రారంభించి, పదమూడు సంవత్సరాలపాటు ఏకధాటిగా నడిపారు. బ్రహ్మసమాజం, హితకారిణీ సమాజం వంటి సంస్కరణ దృక్పథం గల సంఘాల కార్యకలాపాలలో పాలు పంచుకొన్నారు.

**రచనలు:**

చిలకమర్తి పాఠశాలకు వెళ్లేటప్పుడే పద్యాలు రాయడం ప్రారంభించటమేగాక, ఆపై ఎన్నో రచనలు చేశారు. కీచకవధ ఆయన మొదయి నాటకం కాగా, ఆ తరువాత ద్రౌపదీ పరిణయం, గయోపాఖ్యానం, శ్రీరామ జననం, సీతా కళ్యాణం, పారిజాతాపహరణం వంటి నాటికలను రచించారు. నవలా రచనల్లో రామచంద్ర విజయం, హేమలత, అహల్యాబాయి, సుధా శరచ్చంద్రము ముఖ్యమైనవిగా చెప్పవచ్చు. ఇక హాస్య రచనల విషయానికి వస్తే.. "గణపతి" అనే నవల ఎన్నదగింది.

**"గయోపాఖ్యానం":**

22 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు చిలకమర్తి రచించిన "గయోపాఖ్యానం" అనే నాటకం ప్రతులు లక్షకి పైబడి అమ్ముడుపోవటమనేది తెలుగు సాహిత్య చరిత్రలో కనీ, వినీ, ఎరగని విషయంగా చరిత్రలో నిలిచిపోయింది. పైగా ఈ నాటకంలో టంగుటూరి ప్రకాశం పంతులు అర్జునుడి వేషం వేశారట. ఈ నాటకం లోని పద్యాలు వంద సంవత్సారాల నుండి తెలుగు వారి చెవులలో మారుమ్రోగుతున్నాయి. ఈ నాటకాన్ని " ప్రచండ యాదవ " అని కూడా పిలుస్తారు. దాదాపు ప్రతీ తెలుగు నాటక సమాజం ఈ నాటకాన్ని ప్రదర్శించింది. దీన్ని బట్టి ఈ నాటకం ఎంత పరివ్యాప్తి చెందిందో విదిత మవుతోంది. ఆంధ్రదేశంలో అసంఖ్యాకమైన ప్రదర్శనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

**మనోరమ,పత్రిక అనే పత్రికల స్థాపన:**

30 వ ఏట నుండి రేచీకటి వ్యాధికి గురైనా ఏ మాత్రం బెదరకుండా, తన కంటిచూపుకున్న అవరోధాన్ని అతిక్రమించి చిలకమర్తి రచనలు కొనసాగించారు. 1908లో ఒక ప్రెస్ స్థాపించిన ఆయన... 1916లో మనోరమ, పత్రిక అనే పత్రికలను స్థాపించారు. దీని ద్వారా గణపతి, రాజరత్నము, రఘుకుల చరిత్ర, సిద్ధార్థ చరిత్ర వంటివి ప్రచురించారు. అలా ఆయన రచనలు 10 సంపుటాలుగా ప్రచురింపబడ్డాయి. "దేశమాత" అనే వారపత్రిక ద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వ్యాసాలు వ్రాశారు.

**"కళాప్రపూర్ణ పురస్కారం":**

1943లో ఆంధ్ర విశ్వవిద్యాలయం చిలకమర్తిని "కళాప్రపూర్ణ పురస్కారం"తో సత్కరించింది

**హరిజనులకోసం పాఠశాల ప్రారంభం:**


మహాత్మా గాంధీ దక్షిణాఫ్రికా నుండి రాకముందే చిలకమర్తి హరిజనులకోసం ఒక పాఠశాలను స్థాపించిన ఘనత ఆంధ్రదేశంలో చిలకమర్తి వారికి దక్కుతుంది. ఎందుకంటే అంతకు మునుపు ప్రభుత్వంచే నడుపబడుతున్న ఒకటి రెండు పాఠశాలలు తప్ప దళితుల కోసం ప్రత్యేకమైన పాఠశాలలను ఎవరూ స్థాపించలేదు. కేవలం తన పుస్తకాలనుండి వచ్చిన రాబడితోనే, తన స్వంత ధనంతో పాఠశాలను 13 సంవత్సరాలు నడిపి హైయ్యర్ ఎలిమెంటరీ స్కూల్ గా చేసారు.

**"ఫొటోజెనిక్ మెమరీ":**

చిలకమర్తి గ్రహణ, ధారణ శక్తులు అమోఘం. అందుకే వాసురాయకవి చిలకమర్తి వారిది "ఫొటోజెనిక్ మెమరీ" అని ప్రశంసించారు. కంటీ చూపు సరిగా లేనప్పటికి చిలకమర్తి వారి దళిత జనులకు చేసిన సేవలను అప్పటి మద్రాస్ గవర్నర్ లార్డ్ పెంట్ లాండ్ ఎంతగానో ప్రశంసించారు

1894లో ఆయన వ్రాసిన రామచంద్రవిజయం అనే సాంఘిక నవల న్యాపతి సుబ్బారావు నిర్వహించిన పోటీలో మొదటి బహుమతి పొందింది. ఇది ఆయన ఆత్మకథ అంటారు.

## ప్రతిభావాణి




1897 లో వ్రాసిన పృథ్వీరాజీయం అనే గేయ సంపుటి వ్రాతప్రతి ప్రమాదవశాత్తు చిరిగి పోయింది కనుక ప్రచురణకు నోచుకోలేదు.

**హాస్యోక్తులు:**

హాస్యం పండించడంలో, సమయస్ఫూర్తి తో మాట్లాడం చిలకమర్తి వారికి వెన్నతో పెట్టిన విద్య. ఎటువంటి క్లిష్టమైన పద్యాన్ని అయిననూ ఆశువుగా చెప్పడమే కాక, సరళమైన భాషలో అదే పద్యానికి ఎంతో చతురతతో అర్థం చెప్పడం ఆయనకే మాత్రమే చెల్లుతుంది.

**పకోడి" గురించి:**

ఓ సాయంకాలం స్నేహితులంతా కూర్చున్నాక పకోడీలు తెప్పించారు. అక్కడే వున్న చిలకమర్తివారిని వారి స్నేహితులు పద్యాలు చెప్పమని కోరారు. "కవులకు అక్షర లక్షలిచ్చెడి కాలము గతించినది. పద్యమునకు పకోడినిచ్చెడి దుర్దినములు వచ్చినవి" అని హాస్యోక్తులు విసిరారు.

**"నల్లి" మీద:**

మరొక సందర్భంలో "నల్లి" మీద ఆయన రాసిన కింది పద్యం చూడండి.

శివుడద్రిని శయనించుట
రవిచంద్రులు మింట నుంట రాజీవాక్షుం
డ అవిరళముగ శేషుని పై
పవళించుట నల్లి బాధ పడలేక సుమీ.

మంచి వక్త, శ్రోతలను బాగా ఆకట్టుకునే చిలకమర్తి, భారత జాతీయ కాంగ్రెస్ కార్యకలాపాలలో కూడా చురుకుగా పాల్గొన్నారు. చిలకమర్తి ఆశువుగా చెప్పిన భరతఖండంబు చక్కని పాడియావు పద్యం స్వాతంత్ర్య సమరంలో ప్రముఖ స్థానం పొందింది.

**మేకర్స్ ఆఫ్ ఇండియన్ లిట్రేచర్ పుస్తకంలో:**

వి.వి.ఎల్ నరసింహా రావు రచించిన " మేకర్స్ ఆఫ్ ఇండియన్ లిట్రేచర్ " పుస్తకంలో చిలకమర్తి లక్ష్మీనరసిం హం గారు చేసిన కృషి, సాధించిన ఫలితాలని అందించిన ప్రయోజనాలని శ్లాఘించారు. చిన్నతనం నుండి రేచీకటి అనుభవించినా, కడకు కంటి చూపు కోల్పొయినా, తన లక్ష్య సాధనను మానుకోలేదు. కష్టాలను అధిగమించి, విజయాలు సాధించిన మహానుభావుడు. జీవితాంతం తన దేశభక్తిని చాటుకున్నారు. భారతీయతను పెంపొందించారు. సాహిత్య, నాటక రంగ క్షేత్రాలకి ఎన్నో ఆణిముత్యాలు అందించారు. సంఘ సంస్కరణ కోసం పాటు బడ్డారు. సామాజిక అసమానతలని దూరం చేసే భగీరథ ప్రయత్నం చేశారు.

నాటకకర్తగా, నవలా రచయితగా, సంఘసంస్కర్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా తెలుగువారి అందరి మనసులలో స్థానం సంపాదించుకుని "ఆంధ్రా షేక్స్‌పియర్,ఆంధ్రా మిల్టన్"గా అనేక ప్రశంసలందుకున్న లక్ష్మీ నరసింహం 1946, జూన్ 17వ తేదీన పరమపదించారు.ఆయన రచనలు అజరామరమైనవి.

# రెడ్ క్రాస్ - ఆపన్నుల పాలిట పెన్నిధి

యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన లేదా గాయపడిన వారిని ఆదుకొని వారికి ఆసరాగా నిలబడటానికి ప్రత్యక్షంగా ఏర్పాటు అయిన సంస్థ "రెడ్ క్రాస్ సంస్థ".దీనిని స్థాపించిన వ్యక్తి 'హెన్రీ డునాంట్' జన్మించిన మే 8వ తేదీన "అంతర్జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవం" గా జరుపుకుంటున్నాము. 1859 వ సం.లో ఫ్రాంకో- సార్డియన్ కూటమికి, ఆస్ట్రియా సైనిక దళాలకు మధ్య జరిగిన యుద్ధంలో, అలాగే 1861 వ సం.లో అమెరికాలో జరిగిన సివిల్ వార్ లో దాదాపు 60 వేల మంది మరణించగా, కొన్ని వేలమంది గాయపడ్డారు.ఈ యుద్ధాలలో గాయపడిన వారికి సేవలందించడానికి స్విజర్లాండ్ కు చెందిన హెన్రీ డునాంట్ అనే వ్యక్తి ముందుకు వచ్చాడు.ఈ యుద్ధాలలో గాయపడిన వారిని చూసి అతని మనసు




చలించిపోయింది.ఇలాంటి వారి కోసం ఒక సేవసంస్థను స్థాపించాలనే ప్రయత్నంతో "రెడ్ క్రాస్ ఇంటర్నేషనల్ సొసైటీ"ని స్థాపించాడు. ఈయన స్థాపించిన ఈ సంస్థ అంతర్జాతీయ స్థాయిలోని అన్ని దేశాలలో కొన్ని లక్షల మందికి సేవలు అందిస్తుంది.

ఈ కృషికి ప్రయత్నంగా 1910 లో ఈయనకు నోబెల్ ప్రైజ్ కూడా లభించింది. అంతేకాకుండా ఈసంస్థకు 1917,1944లో మరో రెండు సార్లు నోబెల్ శాంతి బహుమతి లభించింది.

అయితే మొదటిసారిగా రెడ్ క్రాస్ దినోత్సవంను 1948 మే 8 నుంచి అధికారికంగా జరుపుకుంటున్నాము.

ఈ సంస్థకు ఈనాడు దాదాపు 10.9 కోట్ల మంది వాలంటీర్లుగా తమ సేవలను అందిస్తున్నారు.ఈ రెడ్ క్రాస్ సంస్థ ప్రస్తుతం ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడడం,ప్రమాదాల సమయంలో చేయవలసిన ప్రథమ చికిత్స గురించి, నర్సులకు మంచి శిక్షణ, వైద్యశాలలు స్థాపన, రక్త నిధులు సేకరణ వంటి అనేక సేవలను అందిస్తుంది.అనేక దేశాలలో కొన్ని కోట్ల మందికి ప్రత్యక్షంగా,పరోక్షంగా సేవలు అందిస్తుంది.ఒక వ్యక్తి ఆలోచన మూలంగా ఏర్పడిన ఈ సంస్థ ఈనాడు అనేక దేశాలలో యుద్ధాలలో గాయపడిన సైనికుల కోసం, యుద్ధ ఖైదీల హక్కుల కోసం నిరంతరం పాటుపడుతుంది. మన దేశంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జూన్ 7 1920 న స్థాపించబడి దాదాపు 750 పైగా శాఖలతో భారతదేశంలో ఆపన్నులకు తన సేవలను కొనసాగిస్తుంది.